క్లుప్తంగా

దాచేపల్లిలో ఉచిత వైద్య శిబిరం



దాచేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వున్నం చారిటబుల్ ట్రస్ట్, వున్నం హాస్పిటల్స్, ఆర్క క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, డాక్టర్ వున్నం ప్రారంభించారు. శిబిరంలో 1,524 మంది రోగులకు సాధారణ జబ్బులతో పాటుగా గుండె, ఊపిరితిత్తులు, గ్యాస్, స్త్రీలకు సంబంధించిన సమస్యలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్ దీపిక, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సాయి నివేద్, డాక్టర్ అశోక్, డాక్టర్ వెంకట్రామిరెడ్డి, డాక్టర్ హేమంత్ పాల్గొన్నారు.

పొంగుతున్న వాగుల వద్ద అప్రమత్తంగా ఉండండి

ఆర్డీఓ మురళీకృష్ణ



మాచర్ల రూరల్: వర్షాల వలన పొంగుతున్న వాగులు, వంకలపై ప్రజలను అప్రమత్తం చేసి జాగ్రత్తలు తీసుకోవాలని గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ కోరారు. ఆదివారం మండలంలోని జమ్మలమడక, రహదారిలోని పొంగుతున్న చంద్రవంక వాగు, చెరువులను పరిశీలించి ఆయన మాట్లాడారు. పొంగుతున్న వాగులను ప్రజలు దాటకుండా తగు చర్యలు తీసుకోవాలని, అలాగే నిలిచి ఉన్న నీటి వచ్చే అంటు వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్య శాఖ వారు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, ఆర్ఐ అనిల్‌కుమార్, వీఆర్‌ఓలు ఆరుముళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. హైస్కూల్లో చదువుకుంటున్న విద్యార్థులకు హిందీ పరీక్షల్లో ప్రత్యేక పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారావు, హిందీ ఉపాధ్యాయురాలు ఎ.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడికి సన్మానం



దాచేపల్లి: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంఈఓ పినాకపాణి అన్నారు. స్థానిక బ్రహ్మనాయుడు ఆడిటోరియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పప్పుల పెరల్సన్ సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. నారాయణపురంలోని ఫాదర్ హైయ్యారు చర్చి ప్రాంగణంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొని పెరల్సన్, శ్యామ్ మేరీ కుమారి దంపతులను శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వట్టెపు నాగేశ్వరరావు, నాగేండ్ల యేసయ్య, తగరం ఆనంద్ కుమార్, లంకె వాసుదేవరావు, సోము వెంకటరమణ, ఆడెపు రాజేష్, వెంకటేశ్వర్లు, సుధీర్ లింకన్, కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

దాచేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో పీఎంశ్రీ ఫేజ్ – 2 కింద రూ.70 లక్షలతో చేపట్టిన పనులను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి హాజరయ్యారు. రూ.69.70 లక్షల తో కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, ప్లే గ్రౌండ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బెల్లంకొండ భారతి, సొసైటీ చైర్మన్ తంగెళ్ల శ్రీనివాసరావు, నాయకులు తోట వెంకటేశ్వర్లు, నాయబ్ అబ్దుల్లా, నారాయణ, నర్రా పుల్లయ్య, శ్రీరాములు నారాయణ, తిరుమల కుమార్, భాస్కరరావు, హస్సన్ అహ్మద్ పాల్గొన్నారు.



యానాది కాలనీలో బజార్ల దుస్థితి

బురదమయం



ఇందిరా బొమ్మ ఎదురు బజారు



వర్షానికి కారెంపూడిలో



మట్టి రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ముఖ్యంగా గ్రామ శివారులోని యానాది కాలనీ, గ్రామంలోని బజార్లు బురద నీటి మయంగా మారాయి. గుంతల్లో నీరు చేరి ఆ ప్రాంత వాసుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. రోడ్లను అభివృద్ధి చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. డ్రెయినేజి కాలువలు రోడ్లు సరిగా లేక ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – కారెంపూడి

విద్యుత్ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి



నిరాహార దీక్ష చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

కారెంపూడి: విద్యుదాఘాతం వలన శాశ్వత అంగవైకల్యానికి గురైన ప్రైవేటు విద్యుత్ కార్మికుడు వర్ల సాగర్ బాబు కుటుంబ సభ్యులు మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ శివారు కాకానివారి పాలెంలోని స్వ గృహంలో ఆదివారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. భర్తతో పని చేయించుకున్న విద్యుత్తు శాఖ ఉద్యోగులే ప్రమాదానికి కారణమయ్యారని వారే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. కుటుంబం మొత్తం సాగర్‌బాబు రెక్కల కష్టంపై ఆధారపడి బతుకుతున్నామని ఇప్పుడు ఆయన మంచానికే పరిమితమయ్యారని తమ కుటుంబం గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్14, 2023లో గ్రామంలో జరుగుతున్న వెంకటేశ్వరస్వామి రథోత్సవం నాడు విద్యుత్ శాఖ లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌లు సాగర్ బాబు 11 కేవీ లైన్ మరమ్మతులు చేయమని తమ కింద పని చేస్తున్న సాగర్‌బాబును కోరడం జరిగిందని అయితే విద్యుత్ సరఫరా నిలపకుండా వారు సాగర్‌బాబుతో పని చేయించుకునే క్రమంలో ఆయన విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విద్యుదాఘాతం వల్ల నడుము, కాళ్లు పని చేయడం లేదని అప్పటి నుంచి ఇప్పటి వరకు హాస్పిటల్స్ చుట్టూ తిరిగినా కోలుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌బాబుది నిరుపేద కుటుంబమని భార్య ఇద్దరు చిన్న పిల్లల పోషణ బాధ్యత ఆయన పైనే ఉందని ప్రజా సంఘాల నాయకులు వినుకొండ పేరయ్య, పిచ్చారావు, బాణావతు దుర్గాబాయి, కొండా నాయక్ తదితరులు ఈ సందర్భంగా వివరించారు. లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌లు జీతాలు వారు తీసుకుంటూ ఇలా ప్రైవేటు వర్కర్స్‌తో పని చేయించుకోవడం అంతటా జరుగుతోందన్నారు. అలా పని చేయించుకుంటున్న సంబంధిత శాఖ అధికారులు ఉద్యోగులు ప్రమాదం జరిగిన తర్వాత వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కూడా వారిపై ఉంటుందన్నారు. అయితే సాగర్‌బాబు బాగోగులు వారు కనీసం పట్టించుకోవడం మానేశారన్నారు. మానవతా దృక్పథంతో స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి



న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే జేబీఆర్

మాచర్ల రూరల్: ఇంజినీరింగ్ డే ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య యువ ఇంజినీర్లకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. 30 దేశాల ఇంజినీర్లకు మార్గదర్శిగా నిలిచిన విశ్వేశ్వరయ్య దేశ ప్రతిష్ఠకు చెందిన అనేక ప్రాజెక్టులను నిర్మించటమే కాకుండా అనేక సంస్థలకు రూపకల్పన చేసిన గొప్ప సాంకేతిక నిపుణులని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రముఖ సివిల్ ఇంజినీర్ కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, రాజబోయిన మధుయాదవ్, గుండాల శ్రీను యాదవ్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో ఏపీఆర్‌డీసీ విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకం సాధించిన భరత్‌రెడ్డి



వెండి పతకం సాధించిన నజీర్

విజయపురిసౌత్: నంద్యాల జిల్లా ఓక్ గ్రామంలో ఈ నెల 13న నిర్వహించిన ఇంటర్ జోనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. ఈ పోటీలో పాల్గొన్న ద్వితీయ సంవత్సరం బీఎస్సీ విద్యార్థి భరత్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా మొదటి సంవత్సరం బీకాం విద్యార్థి ఎస్‌కే నజీర్ ద్వితీయ స్థానాన్ని పొంది వెండి పతకాన్ని గెలుచుకున్నాడు. జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో గెలుపొందిన వీరు ఇద్దరు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. కళాశాలలో ఆటలకు ప్రాధాన్యం కల్పిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ నయింభానుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఇద్దరు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నయింభాను, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నిషేధిత జాబితా 22ఏ లో ఉన్న భూములను ప్రకటించాలి

న్యాయవాది నరిశేటి వేణుగోపాల్



సత్తెనపల్లి: నియోజకవర్గంలోని నిషేధితజాబితా 22–ఏ లో ఉన్న భూముల జాబితా ప్రకటించాలని న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిశేటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, సత్తెనపల్లి రూరల్, రాజుపాలెం, ముప్పాళ్ళ, నకరికల్లు మండలాల రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖ కార్యాల యాల పరిధిలోని నిషేధిత జాబితా 22–ఏలో ఉన్న భూముల జాబితా తక్షణమే బహిరంగ ప్రకటనలో ప్రజలకు వెల్లడించాలన్నారు. పల్నాడు కలెక్టర్, సత్తెనపల్లి ఆర్డీవో, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో తక్షణమే సమీక్ష సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని అటవి, దేవదాయ, వక్ఫ్, ప్రభుత్వ బంజరు, వాగులు, కుంటలు, చెరువు పోరంబోకు భూముల జాబితా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఒక సర్వే నంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉంటే ఆ సర్వే నంబర్ అంతా 22–ఏ కింద రిజిస్ట్రేషన్, రెవెన్యూ రికార్డులలో చూపడంతో అదే సర్వే నంబర్‌లో ప్రైవేటు భూముల యజమానులు క్రయ, విక్రయాలు జరపడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాస్తవ పరిస్థితులు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారు లకు తెలిసినా 22–ఏ జాబితా సరిచేసే ప్రయత్నం చేయడం లేదన్నారు. ఇది సాకుగా చూపించి రెవిన్యూ రికార్డుల మార్పు, రిజిస్ట్రేషన్ కోరకు భూయజమానులు నుంచి అధిక మొత్తంలో డిమాండ్ చేసి ఇచ్చినవారి పనులు చేసి మిగితా వారివి హోల్డ్ లో పెడుతు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలోని 22–ఏ భూముల జాబితా ప్రకటించి, ఒరిజినల్‌గా 22–ఏ భూములు గుర్తించి సంబంధింత శాఖలు ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసువాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములు తప్పుడు సమాచారంతో దొంగ రిజిస్ట్రేషన్‌లు జరిగి ఉంటే ఆ భూములను స్వాధీనం చేసుకొని ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఆయన కోరారు.

మాంటిస్సోరి ఉపాధ్యాయుడికి పురస్కారం



పిడుగురాళ్ల: పట్టణానికి చెందిన మాంటిస్సోరి స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు చింతల నరసింహారావు పాన్ ఇండియా ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ బాషా తెలిపారు. గుంటూరులోని కెనడీ నెక్స్ జెన్ స్కూల్‌లో ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. అనంతరం నరసింహారావును పాఠశాల డైరెక్టర్ బాషా, ప్రిన్సిపాల్ నిర్మల అభినందించారు.

మూగజీవాల రోదన



పిడుగురాళ్ల: మూగజీవాలపై కనికరం చూపడం లేదు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించే సమయంలో ఎక్కువ సంఖ్యలో మూగజీవాలను ఎక్కించకూడదు. ఎక్కిస్తే మూగజీవాలు కదలలేని పరిస్థితి. తినలేని పరిస్థితి ఏర్పడటమే కాకుండా వాహనంలోని భాగాలను ఢీకొని మూగజీవాలు దెబ్బతిని ప్రాణాలను పోగొట్టుకుంటున్నాయి. కానీ మానవుడు తనకు అనుకూలంగా మూగజీవాలను ఇబ్బందులకు గురి చేస్తూ ప్రయాణం సాగించేయిస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి మూగజీవాలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలి



విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని నల్గొండ విశ్రాంత పీఠాధిపతులు గోవింద జోజి అన్నారు. విజయపురిసౌత్‌లోని పుణ్య క్షేత్రమైన సాగర్ మాత ఆలయంలో ఏసుక్రీస్తు జూబిలీ– 2025 కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు అనుగ్రహం భక్తులకు ఎల్లవేళలా ఉంటుందన్నారు. సాటివారిని ఆదరించడం, ప్రేమను పంచిపెట్టడం క్రైస్తవ్యంలో ప్రధానమన్నారు. క్రైస్తవ భక్తులంతా సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ విచారణ గురువులు జోసెఫ్ బాల సాగర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ కమిషనర్ వేణుబాబు



మాచర్ల: పట్టణంలో ప్రజలు పురపాలక సంఘానికి సంబంధించిన అన్నీ సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చునని, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం పురపాలక సంఘ కార్యాలయం, సచివాలయ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

మాచర్ల: మాచర్ల డివిజన్ పరిధిలోని అన్నీ మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ నెల చివరిలోగా పాత విద్యుత్ బకాయిలతో పాటు, ఈ నెల కట్టాల్సిన విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖకు సహకరించాలని డివిజినల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సింగయ్య ఆదివారం తెలిపారు. వచ్చే వారం విద్యుత్ బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించటం జరుగుతుందని చెప్పారు. ఇంటి వద్దకు వచ్చిన విద్యుత్ శాఖ, అధికారులు, సిబ్బందికి అన్నీ శాఖల వారు సహకరించాలని కోరారు. బకాయిల విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదన్నారు. బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్‌లు తొలగించటం జరుగుతుందని హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన గ్రామ రెవెన్యూ సంఘం నాయకులు



మాచర్ల రూరల్: పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కృతికా శుక్లాను పల్నాడు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆరుముళ్ళ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవీ రఘునాథబాబు, ఉపాధ్యక్షులు షేక్ ఖాజావలి, సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షులు వి.వెంకటరామిరెడ్డి, సురేష్, వెంకటేశ్వర్లు, మాబువలి ఉన్నారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

మాచర్ల: పట్టణంలోని అమ్మవారి దేవాలయాల్లో ఈ నెల 22 నుంచి దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాత ఊరులోని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, 10వ వార్డులోని వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం, 13వ వార్డులో సత్యసాయిబాబా దేవాలయ ప్రాంగణం లలిత అమ్మవారి, శ్రీమాత అన్నపూర్ణేశ్వరి, గాయత్రీ దేవి, నెహ్రూ నగర్ ప్రాంతంలోని ఆదిలక్ష్మీ, కేసీపీకి వెళ్లే రహదారిలోని కనకదుర్గ, 7వ వార్డులో అమ్మవారికి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

సీపీఎం కార్యాలయానికి ఇన్వర్టర్ బహూకరణ

సత్తెనపల్లి: పట్టణంలో పాత బస్టాండ్ సమీపంలోని సీపీఎం కార్యాలయానికి పట్టణంలోని పణిదం చేనేత సొసైటీ ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త గంజి వీరాస్వామి ఆదివారం ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులైన గంజి రాములు, అంజమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు వీరాస్వామి, అంజయ్య, శ్రీనివాసరావు ఈ ఇన్వర్టర్‌ను బహూకరించినట్లు ఆయన తెలిపారు. దీన్ని సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమలకు అందజేశారు. సీనియర్ న్యాయవాది పిన్ననేని పాములయ్య అధ్యక్షత వహించిన సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ రాములు పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా



ట్రోఫీతో బాలికలు

శావల్యాపురం: రాష్ట్రస్థాయి అండర్–19 జూనియర్ బాల బాలికల బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్ పోటీల్లో శావల్యాపురం హైస్కూలు బాలికలు సత్తా చాటినట్లు పాఠశాల హెచ్ఎం బోడ్డపాటి విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14 వరకు సత్యసాయి జిల్లా రామపురంలో పోటీలు జరగ్గా బాలికల విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు విన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈసందర్భంగా శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆకుమళ్ళ సమీరా, కామినేడి కావ్యలు స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు అందుకున్నారన్నారు. అక్టోబరు నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఇరువురు బాలికలు పాల్గొంటారన్నారు. అభినందించిన వారిలో పాఠశాల ఆంగ్ల బోధకులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ వై.శ్రీనివాసరావు, ప్రెసిడెంటు ఇ.శివశంకరు, పీడీలు రాగుల రాధా కృష్ణమూర్తి, బి.ఝాన్సీ, కోచ్ జోనానాయక్, మేనేజరు గోపిలు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో దేశభక్తి, సేవాభావం



నరసరావుపేట రూరల్: స్కౌట్ అండ్ గైడ్స్‌లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.పార్వతి తెలిపారు. పాఠశాలలో రెండు రోజుల పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాలకు చెందిన 80మంది స్కౌట్ విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో హెచ్ఎం పార్వతి పాల్గొని మాట్లాడారు. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్కౌట్ విద్యార్థులు తమ వంతు సేవలు అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో సేవాభావాన్ని పెంపొందించేలా స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేర్పించాలని సూచించారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మామిళ్ల కృష్ణయ్య, అసిస్టెంట్ లీడర్ ట్రైనర్ బద్దిగం శివనాగిరెడ్డి, స్కౌట్స్ జిల్లా మానవ వనరుల కమిషనర్ పమ్మి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడే జగద్గురువు

క్రోసూరు: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ఆదివారం 'త్రైతసిద్ధాంత ప్రబోధసేవాసమితి హిందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ –చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో క్రోసూరులో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం ఇంటింటా నిర్వహించారు. శ్రీకృష్ణుడే జగద్గురువు అని అందరూ తెలుసుకోవాలని సభ్యులు తెలిపారు. కృష్ణ భగవానుడి ఊరేగింపు ఊరూరా చేయాలన్నారు. దేవుడే మానవరూపంలో శ్రీకృష్ణుడిగా అవతరించాడని, ఆయన్ను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలని ఊరేగించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక– పిడుగురాళ్ల కమిటీ, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు, సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ, తార్కిక దృక్పథంతో బోధన



వినుకొండ: విద్యార్థి దశ నుంచే చారిత్రిక, భౌగోళిక, పరిపాలన అంశాలు శాస్త్రీయ, తార్కిక పద్ధతుల్లోనే బోధించాలని ఎయిమ్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయ్‌కుమార్ సూచించారు. వినుకొండ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ భూగోళం పుట్టుక, చరిత్ర గమనం, మానవుడి పరిణామ క్రమంలో వచ్చిన మార్పులు భావితరాలకు తెలియాలంటే విద్యావ్యవస్థలో మార్పులు అనివార్యమని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు పి.జె.లూకా, మూర్తి, కౌన్సిలర్ షకీలా, విద్యావంతుల వేదిక సభ్యులు విజయ్‌కుమార్, పిడుగు విజయ్, ఎం.ఎ.సాలార్, తెల్లమేకల శ్రీనివాసరావు, బాషా, మస్తాన్‌వలి, వహిదా, రామాచారి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మాలల రణభేరిని జయప్రదం చేయండి

వినుకొండ: మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో నవంబరు 2వ తేదీన హైదారబాద్‌లో నిర్వహించే మాలల రణభేరి సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మతోటి పొలు కోరారు. వినుకొండలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇటీవల జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, మహానాడు తెలంగాణ అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రణభేరి సభపై చర్చించినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు నిర్వహిస్తున్న ఈ రణభేరి సభలో మాలలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.